క్లుప్తంగా

సీపీఐ మండల కార్యదర్శిగా సుధాకర్



సిద్దిపేటరూరల్: సీపీఐ రూరల్ మండల కార్యదర్శిగా సీతారాంపల్లికి చెందిన మిట్టపల్లి సుధాకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ సమస్యలతోపాటు కార్మిక, రైతుల సమస్యలపై పోరాడుతానన్నారు. తనపై ఉన్న నమ్మకంతో పదవి కేటాయించినందుకు, అందుకు సహకరించిన జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

కొండపాక(గజ్వేల్): స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో చేరడానికి 18 నుంచి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కొండపాక, కుకునూరుపల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలల్లో మూడో తరగతి వరకు చదివిన వారికి కొండపాకలోని వేదా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు తగిన ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు రావాల్సి ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాలుంటాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

200 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యుడు

హుస్నాబాద్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో మల్లె చెట్టు చౌరస్తా వద్ద ఆదివారం ఈ శిబిరం నిర్వహించారు. దాదాపు రెండు వందల మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్సలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు నారాయణరెడ్డి మృతి



నారాయణరెడ్డి(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు కొప్పురవు నారాయణరెడ్డి(99) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గతంలో వున్న పట్వారీ వ్యవస్థలో రేగులపల్లె పట్వారీగా పనిచేశారు. ఆయన మృతికి గ్రామస్తులు, మిత్రులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

సిద్దిపేటకమాన్: విద్యార్థి నాయకుడిపై దాడి చేసి గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం విద్యారంగ సమస్యలు, సామాజిక సమస్యలపై పోరాటం చేసే నాయకుడిపై దుండగులు దాడి చేయడం బాధాకరమన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవాలతో వినూత్న చిత్రం



చిత్రంతో రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: ఫాదర్స్ డే సందర్భంగా ఆవాలతో రూపొందించిన తండ్రీకొడుకుల అపురూప చిత్రాన్ని రామకోటి రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకోటి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తాను ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తన తండ్రే ఆదర్శమన్నారు.

సమస్యల సుడి.. సర్కారు బడి



ప్రమాదకరంగా తరగతిగది పైకప్పు

పెచ్చులూడి పడుతున్న పైకప్పు

- శిథిలావస్థకు చేరిన గదులు
- తరగతి గదులకు అడ్డంగా మట్టికుప్ప
- భయంతో.. ఆరు బయటే విద్యాభ్యాసం
- ఇదీ.. రాంచంద్రాపూర్ పాఠశాల దుస్థితి

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని చెబుతున్న ప్రభుత్వ పెద్దల హామీలు ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి అని పిలుపునిచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు కొన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం అవుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో పిల్లలు ఇబ్బందుల మధ్యే చదువు కొనసాగిస్తున్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ ప్రాథమిక పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఒక పక్క విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు బడిబాట కార్యక్రమాలు చేపట్టి ఉపాధ్యాయులు కష్టపడుతున్నారు. కొన్ని చోట్ల విద్యార్థులు ఉన్నా సరైన వసతులు కల్పించడంలో అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మట్టికుప్పను ఎప్పుడు తొలగిస్తారో?

ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో భారీచెట్టు కూలింది. దీంతో చెట్టుకొమ్మలను తొలగించినా మోడు, ఏర్పడిన పెద్ద మట్టికుప్ప మాత్రం అలాగే ఉన్నాయి. దీంతో పిల్లలు తరగతి గదుల్లోకి వేళ్లలేని దుస్థితి. ఇక చేసేది లేక చెట్లకిందే కూర్చొని చదువుసాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన గదులు

రాంచంద్రాపూర్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. పాఠశాల నిర్మించి యేళ్లు గడుస్తుండటంతో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెచ్చులూడిన పైకప్పు ఎప్పుడు కింద పడుతుందోనని విద్యార్థులు భయం భయంగా విద్యను అభ్యసిస్తున్నారు. సరిపడా తరగతిగదులు లేక, ఉన్నా ప్రమాదకరంగా ఉండటంతో చెట్ల కింద కూర్చొని చదువులు వెళ్లదీస్తున్నారు.

అసలే వర్షాలు

శిథిలావస్థలకు చేరిన తరగతి గదులు, పెచ్చులు ఊడిపడుతున్న పైకప్పు లాంటి సమస్యలతో విద్యార్థులను పాఠశాలకు పంపించాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. దానికితోడు ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మరింత భయబ్రాంతులువున్నారు. ఇప్పటికై నా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆవరణలో వదిలేసిన మోడు, మట్టికుప్ప

చిన్నారులను పంపాలంటే భయం



పాఠశాలలో తరగతి గదులు ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉంది. అధికారులు, ఉపాధ్యాయులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా సమస్య పరిష్కరిస్తే పాఠశాల బలోపేతం కోసం కృషి చేస్తాం.

– కేక్కర్ల దామోదర్ గౌడ్, గ్రామస్తుడు

నిత్యం సమస్యలపైనే పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్



మాట్లాడుతున్న అబ్బాస్, పక్కన మల్లారెడ్డి

సిద్దిపేటఅర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, అట్టడుగు వర్గాలు, శ్రామిక వర్గ సమస్యలపై సీపీఎం పార్టీ నిత్యం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్మిక, కర్షక భవన్‌లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణం, ప్రజా సంఘాల కర్తవ్యంపై బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక వైపు ప్రజల సమస్యలపై పోరాడుతూనే సమాజంలో ఉన్న అనేక అసమానతలను పారద్రోలే విధంగా కృషి చేస్తున్నామన్నారు. సంపద ప్రతి వ్యక్తికి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. సీపీఎం పోరాటాల ఫలితంగానే ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం ఏర్పడ్డాయని గుర్తుచేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కర్తవ్యాలను ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, భాస్కర్, సత్తిరెడ్డి, వెంకట్, కృష్ణారెడ్డి, యాదగిరి, రవికుమార్, రవీందర్, బాలనర్సయ్య, శ్రీనివాస్, శారద, నవీన, శిరీష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా.. ఎర్రజెండా

సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్



మాట్లాడుతున్న మంద పవన్

సిద్దిపేటఅర్బన్: సుదీర్ఘ పోరాటాలు, నాయకుల త్యాగాలతో ఎర్రజెండా పేద ప్రజలకు భరోసాగా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ పట్టణ 16వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వాలు అందించాల్సిన సంక్షేమ పథకాలలో అర్హులకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతీ పంచాయతీలోను, పట్టణంలో సీపీఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణ నూతన కమిటీని ఎంపిక చేశారు. పట్టణ కార్యదర్శిగా బన్సీలాల్, సహాయ కార్యదర్శులుగా హరీఫ్, చంద్రం, 17 మంది కౌన్సిల్ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు శాంతి స్థాపనకు దోహదం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి



పూజలు చేస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఆలయాలు ఆధ్యాత్మికతకు, సమాజంలో శాంతి స్థాపనకు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొట్యాలలో కేతాలమ్మ, మేడాలమ్మ, సమేత మల్లికార్జున స్వామి ఆలయ ద్వితీయ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ నిర్మాత గంగిశెట్టి నాగలక్ష్మి గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి హోమం చేపట్టారు. సాయంత్రం వీరభద్ర స్వామి కల్యాణంతోపాటు అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్తా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్ పాష, మాజీ సర్పంచ్‌లు అర్జున్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, జ్యోతివిజయరెడ్డి, గోపాల్‌రెడ్డి, రోటరీ చైర్మన్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతకాకనే అక్రమ కేసులు

బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధులు

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకనే బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతోందని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి అన్నారు. ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు వాటిని నేరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని, ఇప్పటికై నా పాలనపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పరశురాములు, కన్నోజు రామకృష్ణ, ప్రవీణ్, వికాస్ యాదవ్, రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

అమరేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి



అమరేందర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరం గ్రామాభివృద్ధి కోసం, అలాగే తండాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంలోను అమరేందర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఎంపీటీసీ మాజీ సభ్యుడు లింగాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో ఎడమల అమరేందర్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాలకు విద్యుత్ సదుపాయం కల్పించిన గొప్పనాయకుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలోను వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. గ్రామాలకు రోడ్డు సదుపాయం, ఇతర సేవలు చేసి అందించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎడబోయిన మధుసూదన్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీయం సహాయనిధి పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న కిరణ్‌కుమార్

కాంగ్రెస్ రాష్ట్ర నేత కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): సీయం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మద్దూరు, దూల్మిట్ట మండలాలకు చెందిన 25 మందికి మంజూరైన రూ.10,14,500 సీయం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు భరోసా కల్పిస్తుందన్నారు. పార్టీ నాయకులు, కొమురవెల్లి మాజీ డైరెక్టర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగోల్ గ్రామంలో..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మంగోల్ గ్రామంలో బైండ్ల స్వామికి మంజూరైన రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధితో పేదలు కార్పొరేట్ వైద్యం పొందుతున్నారన్నారు. పైరవీలకు తావులేకుండా అందరికీ ప్రభుత్వం లబ్ధిపొందేలా చూస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లు బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహాచారి, వీరేశం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్

కొండపాక(గజ్వేల్): కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొండపాకలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 సంవత్సరాల ప్రధాని మోదీ పాలనలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారాన్నారు. పసల్ బీమా యోజన కోసం రూ.1.75 లక్షల కోట్లను చెల్లించారని, ఆయుష్మాన్ భారత్ పేరిట 70 యేళ్లు పైబడిన వారి వైద్య ఖర్చుల కోసం రూ.55 కోట్లు కేటాయించారని చెప్పారు. తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా పనిచేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నీల సత్యం, రామస్వామి, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణరెడ్డి, స్వామి, కిషన్,రాజు, ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పంతుల్‌తండాకు చెందిన రైతు భానోతు పకాలియా ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో తండావాసులు, ఉద్యోగస్తులు ఆదివారం రూ.12 వేలు సాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో తండావాసులు దూదియ నాయక్, లావుడ్యా రైనా నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రైతు నేస్తం'

గజ్వేల్‌రూరల్: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ డివిజన్‌లోని రైతు వేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఏడీఏ బాబునాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని అక్కారం, అహ్మదీపూర్, కుకునూర్‌పల్లి, మేదినిపూర్, దుద్దెడ, మర్పడగ, చిన్నమాసాన్‌పల్లి, గజ్వేల్, కొండపాక, రాయపోల్ గ్రామాల రైతు వేదికల్లో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో సాయంత్రం 3 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభిస్తున్నారని, రైతులు హాజరు కావాలని కోరారు.

ప్రమోషన్లు చేపట్టాలి

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు ప్రమోషన్లు చేపట్టాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రమోషన్లు లేక అనేక మంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. జాబ్ క్యాలెండర్ మాదిరిగా యేడాదిలో ఖాళీ అయిన పోస్టులకు ప్రమోషన్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు నాగభూషణం, విజయ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేటరూరల్: 25 యేళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సిద్దిపేటరూరల్: ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 యేళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు అనాటి సంతోషాలు, స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చనిపోయిన తోటి మిత్రులను గుర్తుచేసుకుని మౌనం పాటించారు.

చీకోడ్ పాఠశాలలో..

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.



దుబ్బాకరూరల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పేరుకే క్రీడా ప్రాంగణం

నిర్వహణ అధ్వానం

- పిచ్చిమొక్కలే దర్శనం
- కన్నెత్తి చూడని యంత్రాంగం

గ్రామాల్లోని యువత, విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యమైన జీవితం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉన్నా స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ అధ్వానంగా మారింది.



దుబ్బతండా పరిధిలో క్రీడా ప్రాంగణం దుస్థితి

అక్కన్నపేట(హుస్నాబాద్): సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు ఉండగా అందులో 325 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అక్కన్నపేట మండలంలో మొత్తం 37 గ్రామాలు ఉండగా 25 క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. అయితే బోర్డులను ఏర్పాటు చేసి వదిలేయడంతో పటుచోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.

పిచ్చిమొక్కలతో దర్శనం

క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంలో ఉండటంతో ఆడుకునేందుకు యువకులు, విద్యార్థులు ముందుకు రావడంలేదు. వాటి అలనా, పాలనా పూర్తిగా కరువైంది. దీంతో ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఆటలకు పనికి రాకుండా పోయాయి.

బోర్డులకే పరిమితం

మండలంలోని దుబ్బతండా, కుందనవానిపల్లి, అక్కన్నపేట, అంతక్కపేట, చౌటపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అందులో కనీసం క్రీడా పరికరాలు సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో ఒక్క రోజు కూడా క్రీడాకారులు వచ్చి ఆటలు ఆడిన దాఖలాలు లేవు. క్రీడా ప్రాంగణం అనే బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకోరావాలని యువకులు, క్రీడాకారులు కోరుతున్నారు.